సాక్షి జగిత్యాల

శుక్రవారం । 26 । మే । 2023

సీఎం సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



జగిత్యాల: హైదరాబాద్‌లో గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జరిగిన సమావేశంలో కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ద వేడుకల నిర్వహణ, పోడు భూముల పట్టాల పంపిణీపై సమావేశంలో చర్చించారు.

న్యూస్‌రీల్

కొండగట్టు అంజన్న ఆదాయం రూ.86లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించామని ఆలయ ఈవో వెంకటేశ్ తెలిపారు. మొత్తం 22 రోజులకు రూ.86,92,556 నగదు, 40విదేశీ కరెన్సీ నోట్లు, 9గ్రాముల మిశ్రమ బంగారం, 2.150 కిలోల వెండి సమకూరినట్లు వివరించారు. లెక్కింపులో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఏసీ చంద్రశేఖర్, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, ఇన్‌స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

కోరుట్లటౌన్: ప్రతీ మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ సూచించారు. స్థానిక 24వ వార్డు మున్నూరుకాపు సంఘ భవనంలో మెప్మా ఆధ్వర్యంలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించిన 14420 టోల్‌ఫ్రీ నంబరు ప్రచార పోస్టర్ విడుదల చేశారు. సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయకపోతే అందులోంచి విష వాయువులు విడుదల అయ్యే ప్రమాదం ఉందని ఆయన చెప్పారు. అవసరమైన వారు 14420 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలనాయన సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మహేశ్, మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ సంధ్య, సీవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. స్థానిక 4వార్డులో చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలు, మురుగు నీటి కాల్వల్లో చెత్త వేయవద్దని పేర్కొన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి చెత్త ఇవ్వాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో పారిశుధ్య సమస్య నివారణకు ప్రణాళిక తయారు చేశామని అన్నారు. ప్రజలు పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. వినియోగించిన దుస్తులను పేదవారికి అందజేయడానికి మున్సిపల్ కార్యాలయంలో ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంట కౌన్సిలర్ పురుషోత్తం, సిబ్బంది ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

'బాధిత రైతుపై కేసు పెట్టడం శోచనీయం'



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉమ

కథలాపూర్(వేములవాడ): ధాన్యం తరలించడం లేదనే ఆవేదనలో ఉన్న రైతుపై అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు పెట్టడం శోచనీయమని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ విమర్శించారు. ధాన్యం తరలింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన భూషణరావుపేటలోని రైతు గోపిడి మాధవరెడ్డిని ఆమె గురువారం పరామర్శించారు. బాధలో ఉన్న రైతు గురించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నాయకులు ఎడ్మల వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, పల్లె గంగాధర్, మల్యాల మారుతి, గట్ల కృష్ణ, తుమ్మనపెల్లి మహేశ్, నరెడ్ల రవీందర్‌రెడ్డి, శ్రీరాముల ప్రకాశ్, గాంధారి శ్రీనివాస్, మేడిపెల్లి గంగాధర్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

24 రోజులు.. 42 ప్రమాదాలు

23మంది మృతి.. 39మందికి గాయాలు

మల్లాపూర్ మండలం మొగిలిపేట శివారులో ఈనెల 24న రాత్రి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ ఖాసీర్ మరో వ్యక్తితో కలిసి నడుచుకుంటూ వెళ్తున్నాడు. మొగిలిపేటకు చెందిన బారెండ్ల సురేశ్(19), నరహరి కిషన్ ద్విచక్ర వాహనంపై వచ్చి అబ్దుల్ ఖాసీర్(39)ను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఖాసీర్‌తోపాటు ద్విచక్ర వాహనం నడుపుతున్న బారెండ్ల సురేశ్ దుర్మరణం చెందారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో ఈనెల 23న అదే గ్రామానికి చెందిన విఘ్నేశ్, రాహుల్ ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లి వైపు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన అదే గ్రామ యువకుడు వన్నెం మహేశ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో మహేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి అజాగ్రత్త, అతివేగమే కారణమని తేలింది.

కోరుట్ల మండలం వెంకట్రావ్‌పేట బస్టాండ్ వద్ద జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఈనెల 22న జరిగినరోడ్డు ప్రమాదంలో పందిరి హన్మండ్లు(52) చనిపోయాడు. మేడిపల్లి మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన హన్మండ్లు, కొత్తపల్లి రాజం కలిసి పశువులకు మందు కొనుగోలు చేసేందుకు కోరుట్లకు వెళ్తున్నారు. జగిత్యాల నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. బస్సు డ్రైవర్ అజాగ్రత్తే ప్రమాదానికి కారణమని అధికారులు భావిస్తున్నారు.

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపో వద్ద జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై ఈనెల 22న తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై జగిత్యాలకు వస్తున్న నిజామాబాద్‌కు చెందిన షేక్ మహ్మద్ హుస్సేన్(42)ను ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో షేక్ మహ్మద్ హుస్సేన్ మృతిచెందాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని పోలీసులు భావిస్తున్నారు.



వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)

- అజాగ్రత్త.. అతివేగమే కారణం
- ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు
- ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం
- నియంత్రణపై దృష్టి సారించని అధికారులు
- శాఖల మధ్య సమన్వయ లోపమే కారణం
- మూల్యం చెల్లిస్తున్న ప్రజలు



ఎండపల్లి మండలం కొత్తపేటలో లారీని ఢీకొన్న బస్సు(ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరంపర నియంత్రణలోకి రావడంలేదు. ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యమని వివిధ శాఖల అధికారులు గుర్తించినా కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దీంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈనెలలో కేవలం 24 రోజుల్లోనే 42 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదు కావడం, 23మంది చనిపోవడం, 39మంది గాయపడడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

పోలీసుల వద్ద సమాచారం

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రవాణా శాఖ అధికారులు తీసుకున్న చర్యలపై జిల్లా రవాణా శాఖ అధికారి శ్యామ్‌నాయక్‌ను సంప్రదిస్తే.. ప్రమాదాలకు గల కారణాల సమాచారం పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేస్తారన్నారు. రవాణా శాఖ అధికారులు ప్రమాదానికి కారణమైన వాహనాలను మాత్రమే పరిశీలించి నోటీసులు జారీ చేస్తారని పేర్కొన్నారు. హెచ్చరిక బోర్డుల పర్యవేక్షణ బాధ్యత రోడ్లు, భవనాల శాఖ అధికారులదేనని వివరించారు.

బ్లాక్‌స్పాట్లు గుర్తించేది వారే..

రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను(బ్లాక్ స్పాట్‌లు) పోలీసులే గుర్తిస్తారని జిల్లా రోడ్లు, భవనాల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ఎన్ని ప్రమాద స్థలాలు ఉన్నాయని అడిగితే.. తమ వద్ద అలాంటి సమాచారం ఏదీ లేదన్నారు. పోలీసులే రోడ్డు ప్రమాద స్థలాల వివరాల గురించి తెలుసుకుని తమకు సమాచారం అందిస్తారన్నారు. దీనిద్వారా ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

హెచ్చరికలు బేఖాతరు

- జిల్లాలో పోలీసు శాఖ అధికారులు రోడ్డు ప్రమాద స్థలాలు గుర్తించి ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది.
- ఇలా గుర్తించిన ప్రాంతాల్లో ఏర్పాట్లు చేయడాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.
- మరోవైపు.. చాలామంది వాహనదారులు డ్రైవింగ్‌లో హెల్మెట్ ధరించడంలేదు.
- అతివేగంగా, అజాగ్రత్త, మొబైల్ మాట్లాడుతూ కొందరు డ్రైవింగ్ చేస్తున్నారు.
- దీంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

జిల్లాలో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో పెద్దదిక్కును కోల్పోయి అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రమాదాల నియంత్రణకు అధికారులు ప్రణాళిక రూపొందించినా.. ఆచరణలో అంతగా శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా పోలీసు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం ఇందుకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

సందిగ్ధంలో సన్నద్ధం..!



- సమీపిస్తున్న సప్లిమెంటరీ పరీక్షలు
- ఫెయిలైన టెన్త్ విద్యార్థులపై దృష్టి పెట్టేదెవరు?
- ప్రభుత్వ పాఠశాలల్లో రివిజన్‌పై శ్రద్ధ కరువు

టెన్త్ విద్యార్థుల వివరాలు

పరీక్ష రాసినవారు	11,159
ఉత్తీర్ణులైనవారు	9,379
ఫెయిలైనవారు	1,780

ఫెయిలైన విద్యార్థులు సబ్జెక్టుల వారీగా

సబ్జెక్టు	విద్యార్థులు
గణితం	1,411
తెలుగు	235
ఆంగ్లం	124
సామాన్యశాస్త్రం	535
సాంఘికశాస్త్రం	88
హిందీ	13

పెగడపల్లి(ధర్మపురి): గత విద్యాసంవత్సరం (2022–23)లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా సుమారు 20శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేకపోయారు. వీరికి జూన్ 14న సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అయితే, పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇంకా సుమారు ఇరవై రోజుల గడువు మాత్రమే ఉంది. ఫెయిలైన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు తక్కువ మార్కులు వచ్చిన సబ్జెక్టులు, విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి వారిని పరీక్షలకు సన్నద్ధం చేసే బాధ్యత విద్యాశాఖ తీసుకోవాల్సి ఉందని విద్యాభిమానులు సూచిస్తున్నారు.

టెన్త్‌లో 84.5శాతం ఉత్తీర్ణత..

- జిల్లాలో 11,159 మంది పదో తరగతి వార్షిక పరీక్షలు రాశారు.
- ఇందులో 9,379 మంది పాసవ్వడంతో 84.5 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- వందశాతం ఉతీతర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు జిల్లాలో 29 ఉన్నాయి.
- పరీక్షల్లో తప్పినవారు 1,780 మంది విద్యార్థులున్నారు. వీరిలో ఎక్కువ మంది గణితంలో ఉత్తీర్ణత సాధంచలేకపోయారు.

ఆరు పేపర్లకు కుదించగా..

గతంలో హిందీ మినహా మిగతా సబ్జెక్టులకు రెండు పరీక్ష పేపర్లు ఉండేవి. గత విద్యా సంవత్సరం నుంచి విద్యాశాఖ అన్ని సబ్జెక్టులను ఆరు పేపర్లకు కుదించింది. ఒక సబ్జెక్టుకు రెండు పేపర్లున్నప్పుడు చదవడం సులభంగా ఉండేది. ఇప్పుడంతా ఒకే పేపరు కావడంతో ప్రశ్నలు ఎలా ఇస్తారననే ఆందోళన ఉంది. కరోనా నేపథ్యంలో విద్యార్థులు సుమారు రెండేళ్లపాటు చదువుకు దూరమయ్యారు. ఆ ప్రభావంతో చాలామందిలో అభ్యసనా సామర్థ్యాలు తగ్గాయి. ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించినా ఆశించిన ఫలితాలు రాలేదు. దీనికి తోడు జిల్లాలో 82 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిభర్తీ మధ్యలోనే నిలిచిపోయింది. ఫలితంగా సబ్జెక్టు బోధనకు ఉపాధ్యాయులు లేకపోవడం విద్యార్థులు ఫెయిల్ అవడానికి కారణమని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సప్లిమెంటరీ పరీక్షల కోసం వారిని సన్నద్ధం చేయడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి



పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షల కోసం సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారుల నుంచి మాకు ఆదేశాలు రాలేదు. దీనిపై అధికారికంగా ప్రకటన కూడా చేయలేం. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే చొరవ తీసుకుని సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా చూడాలి.

– జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో

రాయికల్ ఆస్పత్రి సందర్శన

రాయికల్(జగిత్యాల): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బృందం సభ్యులు శిరీష, రాజేందర్‌సింగ్ గురువారం సందర్శించారు. కుష్ఠు నివారణకు తీసుకుంటున్న చర్యలపై డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ వారికి వివరించారు. డాక్టర్ నరేంద్ర, సూపర్‌వైజర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, సీహెచ్‌వో ప్రమీల పాల్గొన్నారు.

రామకిష్టయ్యకు సన్మానం



సన్మానం అందుకుంటున్న రామకిష్టయ్య

ధర్మపురి: హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ సారస్వత పరిషత్ బాల సాహిత్య సమ్మేళనంలో పట్టణానికి చెందిన కవి, రచయిత సంగనభట్ల రామకిష్టయ్య పాల్గొన్నారు. దేశంలోని 24 రాష్ట్రాలకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు హాజరయ్యారు. 'బాల సాహిత్యంలో నాడు.. నేడు' అంశంపై రామకిష్టయ్య చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. పిల్లల అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా కథలు రాయాలని సూచించారు. కథలపై ఆసక్తి కలిగేలా, కథల పుస్తకాలు చదివేలా, ఆకట్టుకునేలా రాయాలని తన ఉపన్యాసంలో సూచించారు. అనంతరం సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య చేతుల మీదుగా రామకిష్టయ్యను సన్మానించారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- ముగిసిన చీఫ్ మినిస్టర్ కప్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కబడ్డీ విజేత జట్టుతో అధికారులు



రాష్ట్రయి పోటీలకు ఎంపికైన నరేశ్, రాజేశ్

జగిత్యాల: క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు గెలుపు లక్ష్యంగా ఆడాలన్నారు. ఇందుకోసం పీఈటీలు వ్యూహాలు రచించి అమలు చేయాలని సూచించారు. జిల్లాస్థాయి చీఫ్ మినిస్టర్ కప్ ముగింపు క్రీడా పోటీలు గురువారం జిల్లా కేంద్రంలో జరిగాయి. ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భవించాక అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరావు, సంక్షేమాధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక..

మల్లాపూర్(కోరుట్ల): సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వీవీరావుపేట క్రీడాకారులు నరేశ్, రాజేశ్ ఎంపికయ్యారని వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల సర్పంచులు బిట్ల సరోజన, జోగుల మమత తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో వీరు అద్భుత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. క్రీకారులను సర్పంచులతోపాటు ఎంపీటీసీలు భూమి, సుజాత, ఉపసర్పంచులు రాజనర్సయ్య, రవి తదితరులు అభినందించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

జగిత్యాలరూరల్: సీఎం కప్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో జగిత్యాల రూరల్ మండలం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో జట్టు ప్రతిభ చూపడంపై ఎంపీడీవో రాజేశ్వరి, శైలజ, పీఈటీలు కృష్ణప్రసాద్, విశ్వప్రసాద్, అజయ్‌బాబు, వెంకటలక్ష్మి, ఎంపీవో రవిబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

బోనమో పోచమ్మ



మల్యాల(చొప్పదండి): తక్కళ్లపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తూర్పువాడ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలోనూ పోచమ్మ బోనాలు నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు పుట్టపాక రవి, నాయకులు భూసారాజు నర్సయ్య, ముత్యంపేట నర్సయ్య, భూసరాజు ధర్మయ్య, గొల్లపల్లి చంద్రయ్య, పుట్టపాక నరేశ్, భూసరాజు వెంకటేశ్, శాతాల రాజు, గౌరవెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రంలో గురువారం నల్లపోచమ్మ బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. తొలుత మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. తమ కుటుంబాలను సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పాల్గొన్నారు.





కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం కొండాపూర్ గ్రామంలో గురువారం పెద్దమ్మతల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం సభ్యులు ఇంటికో బోనంతో డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయానికి చేరుకున్నాక మహిళలు పెద్దమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

శరత్‌కు సన్మానం



శరత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన గుగ్లావత్ శరత్ నాయక్ ఐఏఎస్‌లో శిక్షణ పూర్తి చేసుకొని త్రిపుర రాష్ట్రంలో కలెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. ఈసందర్భంగా గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కలెక్టర్ శరత్ ఇంటికి వెళ్లి కలిశారు. శరత్ 2022లో సివిల్స్‌లో ఫలితాల్లో 374వ ర్యాంకు సాధించాడు. ఏడాది పాటు వివిధ హోదాల్లో శిక్షణ పొంది ఇంటికి వచ్చారు. ఈనేపథ్యంలో మీరు– నేను కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చెర్లపల్లిలో పర్యటించిన సందర్భంగా కలెక్టర్ శరత్‌ను సన్మానించారు. కలెక్టర్ సైతం ఎమ్మెల్యేను సన్మానించారు.

వరిపొలాల్లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

ధర్మపురి: వరి పొలాల్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించగా, గ్రామస్తులు మంటలను ఆర్పి వేయడంతో భారీ ప్రమాదం తప్పింది. వివరాలు.. మండలంలోని జైనా గ్రామంలో గోదావరి పరిసర ప్రాంతాల్లోని వరి పొలాల్లో గురువారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వరి పొలాల్లోని గడ్డికి నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైరింజన్‌కు ఫోన్ చేయగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుంది. గ్రామస్తులు, ఫైర్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

కలప పట్టివేత



అధికారులు పట్టుకున్న కలప

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని కొత్తదాం రాజుపల్లి శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను డిప్యూటీ రేంజ్ ఫారెస్టు అధికారి, ఇన్‌చార్జి సెక్షన్ అధికారి చంద్రమౌళి, బీట్ అధికారి సత్తార్ నేతృత్వంలో అటవీ సిబ్బంది బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఎఫ్ఎస్వో కథనం ప్రకారం.. అక్రమంగా కలపను నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా కొత్తదాంరాజుపల్లి శివారులో 12 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.22,418 ఉంటుందని, వాటిని రాయికల్ అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు వివరించారు.

అర్పపల్లిలో ఒకరిపై దాడి

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లి గ్రామంలో ఒకరిపై దాడి చేయడంతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు కథనం ప్రకారం.. అర్పపల్లికి వెంకటయ్యపై అదే గ్రామానికి చెందిన నరేశ్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు పాత కక్షలు మనసులో పెట్టుకుని దాడికి పాల్పడ్డారు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు నరేష్, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాయితీలకు మంగళం

- నాలుగేళ్లుగా నిలిచిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం
- విత్తనాలపై సబ్సిడీ కూడా ఎత్తివేసిన ప్రభుత్వం
- పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతున్న రైతులు
- సబ్సిడీ పథకాలు అమలు చేయాలని డిమాండ్



జగిత్యాలరూరల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామంటున్న ప్రభుత్వం అందుకు తిలోదకాలిస్తోంది. నాలుగేళ్లగా సబ్సిడీ పథకాలను పూర్తిగా నిలిపివేసింది. వ్యవసాయ యాంత్రీకరణ పథకంతో పాటు విత్తనాలపై ఇచ్చే సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసింది. నాలుగేళ్లుగా రైతుబంధు, రైతుబీమా మాత్రమే అమలు చేస్తోంది. అయితే రైతులు కూడా పలు సందర్భాల్లో సబ్సిడీ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. పలు రైతు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం సబ్సిడీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తిరిగి యాంత్రీకరణ, విత్తనాలపై రాయితీలను పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మోయలేని భారం

గతంలో అమలు చేసిన యాంత్రీకరణ పథకంలో భాగంగా ట్రాక్టర్లు, టిల్లర్లు, రోటోవేటర్లు, టార్పాలిన్లు, నాగళ్లు, విత్తనాలు వెదజల్లే మిషన్లను, స్ప్రేయర్లు తదితర యాంత్రీకరణ పనిముట్లను రైతులకు 50 శాతం సబ్సిడీపై ఇచ్చేవారు. దీనికి తోడు వరి, కంది, పెసర, మినుము, ఆముదం, వేరుశనగ విత్తనాలకు కూడా ప్రభుత్వం రాయితీని పూర్తిగా ఎత్తివేసింది. దీంతో రైతులు పొలాలు, దుక్కుల దున్నకం, విత్తనాల కొనుగోలు కోసం మోయలేని భారాన్ని మోస్తున్నారు. సబ్సిడీ పథకాలను అమలు చేయడం వల్ల రైతులకు సగం ధరకే ట్రాక్టర్లు ఇతర యంత్రాలు వచ్చేవి. దీంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేవారు. ప్రస్తుతం సబ్సిడీలు లేకపోవడంతో పూర్తి ధరలను చెల్లించి విత్తనాలు, యంత్రాలను కొనుగోలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పీడిస్తున్న కూలీల కొరత

వ్యవసాయ రంగాన్ని కూలీల కొరత పీడిస్తోంది. యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడం ద్వారా కూలీల కొరతను నివారించ వచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు. యాంత్రీకరణలో కోత మిషన్లు, ట్రాక్టర్లు, ట్రిల్లర్లతోపాటు మందులను స్ప్రే చేయడానికి డ్రోన్లను కూడా సబ్సిడీపై రైతులకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సబ్సిడీ పథకం అమలు చేయాలి



వ్యవసాయ రంగాన్ని కూలీల కొరత పట్టిపీడిస్తోంది. కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యాంత్రీకరణ పథకాన్ని తిరిగి అమలు చేయాలి. రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, వరికోత మిషన్లతో పాటు డ్రోన్లను ఇవ్వాలి. కేంద్రం కూడా సబ్సిడీ వాటాను విడుదల చేయాలి.
– నాగిరెడ్డి రాజిరెడ్డి, రైతు, పొరండ్ల

సబ్సిడీపై జనుము, జీలుగ..

రైతాంగానికి జనుము, జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నాం. గత సీజన్‌లో వేరుశనగ విత్తనాలు కూడా రాయితీపై అందజేశాం. ప్రభుత్వం రైతుల కోసం ఏ పథకం అమలు చేసినా వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నాం.
– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

బాధిత కుటుంబానికి బాసట



చెక్కు నకలు అందజేస్తున్న చాంద్‌పాషా

మల్యాల(చొప్పదండి): తోటి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు గల్ఫ్ కార్మికులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి అండగా నిలిచారు. 20 ఏళ్లుగా ఉపాధి కోసం గల్ఫ్‌బాట పట్టిన మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన లింగాల ముత్తయ్య ఈ నెల14న అనారోగ్యంతో గల్ఫ్‌లో మృతిచెందాడు. కంపెనీ పీఆర్‌ఓ జలీబ్ అహ్మద్ సహకారంతో తోటి కార్మికులు రూ.4,83,801 చందాలు సేకరించారు. ముత్తయ్య భార్య నర్సవ్వ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ముత్తయ్య ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు సాయం చేసిన, మృతిచెందిన అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడంతో కృషి చేసిన కాంగ్రెస్ పీసీసీ రాష్ట్ర ఎన్ఆర్‌ఐ సెల్ కన్వీనర్ చాంద్‌పాషా గురువారం బాధిత కుటుంబ సభ్యులను కలిశాడు. బ్యాంకులో జమ చేసిన మొత్తానికి సంబంధించి చెక్కు నకలు అందజేశారు. మరో రూ.లక్ష రావాల్సి ఉన్నాయని, ఆ మొత్తాన్ని సైతం బాధిత కుటుంబ సభ్యులకు అందించేందుకు కృషి చేస్తామని చాంద్‌పాషా తెలిపారు.

కొనసాగుతున్న విచారణ

జగిత్యాల: ఇంటర్ పరీక్షల ఇన్విజిలేషన్ విధులకు గైర్హాజరవడం, ఫేక్ సర్టిఫికెట్ సమర్పించిన కారణంగా ఇటీవల సారంగాపూర్ మండలం రేచపల్లి బీంరెడ్డి గూడెంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు అనితను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా, కొన్ని మండలాల్లో ఉపాధ్యాయులు ఇంటర్మీడియెట్ ఇన్విజిలేషన్‌కు వెళ్లి అటు పరీక్షలకు, ఇటు పాఠశాలకు వెళ్లకుండా ఎగనామం పెట్టారు. ఈ విషయంపై 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఇప్పటికే సారంగాపూర్ మండలంలో ఒక ఉపాధ్యాయురాలితో పాటు మరికొంత మంది ఇన్విజిలేషన్‌కు అటెండ్ కాకుండా, అటు పాఠశాలకు వెళ్లకుండా జీతభత్యాలు పొందిన విషయం తెలిసింది. ఇలాగే జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లోని ఉపాధ్యాయులు సైతం ఇలాగే చేసినట్లు తెలిసింది. దీంతో ఎంఈవోలు వారికి రిలీవ్ చేసిన ఆర్డర్, వారు జాయిన్ అయినప్పుడు అందజేసిన డ్యూటీ సర్టిఫికెట్లు, పాఠశాలల్లో మార్చి మాసానికి సంబంధించిన అటెండెన్స్ జిరాక్స్ కాపీ, మార్చిలో చెల్లించిన పేబిల్స్ ఇవ్వాల్సిందిగా మండల విద్యాధికారులందరికీ డీఈవో ఆదేశాలు జారీ చేశారు.

రూ.11 లక్షలు దుర్వినియోగం

- ఆడిట్‌లో బట్టబయలు
- ప్రతీ పైసా రికవరీ చేస్తాం : డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీనారాయణ

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రంలోని గ్రామైక్య సంఘంలో రూ.11 లక్షలు స్త్రీనిధి బ్యాంకు సొమ్ము దుర్వినియోగం అయినట్లు ఆడిట్ అధికారులు తేల్చారు. దీనిపై నెల రోజులుగా డీఆర్‌డీఏ అధికారులు విచారణ జరిపి సొమ్మును రికవరీ చేసేందుకు బాధ్యులకు నోటీసులు పంపినట్లు డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వివరాలు.. బీర్‌పూర్ గ్రామైక్య సంఘంలో మొత్తం 30 గ్రూప్‌లు ఉన్నాయి. ప్రతీ గ్రూప్‌లో 15 మంది చొప్పున మహిళలు సభ్యులుగా ఉన్నారు. 2015–16లో ఆ సంఘానికి స్త్రీనిధి ద్వారా మంజూరైన సొమ్ము నుంచి రుణం పొందేందుకు 450 మంది సభ్యులు సంతకాలు చేశారు. రుణం మంజూరైన తర్వాత సదరు సభ్యుల్లో కొంత మంది తమకు డబ్బు అవసరం లేదని రుణం తీసుకునేందుకు నిరాకరించారు.

రెండేళ్లుగా విచారణ

ఈక్రమంలో పలువురు సభ్యులు నిరాకరించిన సొమ్ము గ్రామంలోని వీవోఏ (సీఏ)ల పరిధిలోకి వెళ్లింది. ఆ డబ్బును తిరిగి స్త్రీనిధి బ్యాంకుకు పంపించాల్సిన ఉండగా వీవోఏలు సొంతానికి వాడుకున్నారు. వాడుకున్న డబ్బును కొన్ని నెలలు చెల్లించి తర్వాత మానేశారు. దీంతో గ్రామైక్య సంఘంలో తీసుకున్న డబ్బును సభ్యులు సక్రమంగా చెల్లించడం లేదని స్త్రీనిధి బ్యాంకు అధికారులు సంబంధిత సెర్ప్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రెండేళ్ల నుంచి అధికారులు విచారణ జరిపారు. చివరకు గత ఏప్రిల్‌లో జిల్లాస్థాయి అధికారులు నెల రోజుల పాటు రికార్డుల ఆధారంగా సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. విచారణలో రూ.11 లక్షల వరకు దుర్వినియోగం అయినట్లు నిర్ధారణకు వచ్చారు. నెల రోజులుగా జరుగుతున్న ఆడిట్‌లో పూర్తి వివరాలు వెల్లడయినట్లు డీఆర్‌డీఏ పీడీ తెలిపారు. సొమ్ము రికవరీకి సంఘ సభ్యులు, సీఏలకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

పాముకాటుకు వృద్ధుడు మృతి



సొడం నర్సయ్య మృతదేహం

వెల్గటూర్(ధర్మపురి): పాముకాటుతో వృద్ధుడు మృతిచెందాడు. గ్రామస్తుల వివరాలు.. మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన సొడం నర్సయ్య (68) గీత కార్మికుడు. రోజులాగే బుధవారం ఈదులు గీసి వచ్చి రాత్రిపూట ఇంటి ఆవరణలో మంచంలో కాళ్లు కిందకు పెట్టి కూర్చుని ఉండగా పాము కుడి కాలుపై కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు సొడం రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ఆదర్శ దంపతులు

- వివాహ వార్షికోత్సవం సందర్భంగా అవయవ దానానికి అంగీకారం



రవికుమార్- మమత దంపతులు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బైరి రవికుమార్‌యాదవ్–మమత దంపతులు ఆదర్శంగా నిలిచారు. ఈ నెల 24న వారి వివాహ రెండో వార్షికోత్సవం సందర్భంగా సంపూర్ణ అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అవయవ దానానికి సంబంధించి పత్రాల్లో సంతకాలు చేసి గురువారం జనహితం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, జనహితం స్వచ్ఛంద సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రారంభించిన 'జీవనందన' కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు ముందుకు వచ్చామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరికొంత మంది భావితరాల కోసం తమ లాగే అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. ఈసందర్భంగా రవికుమార్– మమత దంపతులను జనహితం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: 2023–24 విద్యా సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి నేషనల్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ఠ ద్వారా ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.shreshta.nta.nic.in లో దరఖాస్తులు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27 వ తేదీ చివరి గడువు అని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 18న నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండలం కొత్తపేటలో చోటుచేసుకుంది. చందుర్తి మండలంలోని కొత్తపేటకు చెందిన తీపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(35) భార్య లత కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త పలుమార్లు తీసుకొచ్చేందుకు వెళ్లగా నిరాకరించింది. మనస్థాపానికి గురైన శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై రమేశ్ తెలిపారు.

ఎంసెట్‌లో సత్తాచాటిన 'అల్ఫోర్స్'



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఎంసెట్–2023 ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమర్యాంకులు సొంతం చేసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయంలో గురువారం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి సన్మానించి ర్యాంకుల వివరాలు వెల్లడించారు. ఎం.అభిరామ్ 301వ ర్యాంకు సాధించి అత్యున్నత స్థానంలో నిలిచాడు. ఎ.ఇషాంత్‌రెడ్డి 322, బి.శ్రీగోధ 356, జి.జ్యోతి 374, టి.దీపిక 446, ఎం.చిన్మయ్ 542, బి.శ్రీనివాస్ 650, ఎస్.సాయిసధిష్ట 681, కె.ప్రణీత రెడ్డి 752, హస్వితరెడ్డి 818, బి.విద్యాలక్ష్మి 821, ఎస్.ధీరజ్‌కుమార్ 833, ఎస్.మనస్విని 865, ఆర్.సుహాసిత 893వ ర్యాంకు సాధించారు. అలాగే వెయ్యిలోపు 14 మంది, రెండువేల లోపు 40, మూడువేల లోపు 63, ఐదువేల లోపు 118 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ(మెయిన్) ఫలితాల్లో విద్యార్థులు సత్తాచాటి 450 మంది ఐఐటీ (అడ్వాన్స్)కి అర్హత సాధించారని గుర్తు చేశారు. రాబోయే నీట్ ఫలితాల్లో కూడా ఉత్తమ ర్యాంకులతో ముందంజలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: ఎంసెట్–2023 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. యు.మోహన్‌సాయి 256వ ర్యాంకు, ఎ.కీర్తన 896, కె.డింపుల్ జస్టినా 1,092, మధుకర్ 1,109, ఎస్.శ్రీనివాస్ 1,903, బి.సాయి వినీత్ 2,078, ఐ.రమణి 2,770, డి.వంశీకృష్ణ 2,943, డి.కార్తీక్ 2,958వ ర్యాంకులు సాధించారు. 5వేల లోపు 12 మంది, 28 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాక్రిష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు అభినదించారు.

ట్రినిటీ విజయదుందుబి

కరీంనగర్: ఎంసెట్ ఫలితాల్లో పెద్దపల్లి, కరీంనగర్ ట్రినిటీ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఎంపీసీ విభాగంలో ఎం.రాజారెడ్డి రాష్ట్రస్థాయిలో 186ర్యాంకు, టి.అభినయ 848, ఎస్.సుహాస్‌రెడ్డి 1128, పి.శ్రీధాన్‌శాష్ 2007, బైపీసీ విభాగంలో వి.మధుకర్ 1109, డి.సాయిలక్ష్మి మానస 1969, బి.ప్రణయ్ 1976, షఫీ నాషీన్ 2321, ఎస్.ఫాతీమా 2464, కె.లిఖిత 2479, బి.దీపక్ 2531, ఎం.రేఖ 2698, వి.అర్పిత 2783 ర్యాంకులు సాధించారు. బి.సిరి 3126 ర్యాంకు, జి.హన్విత 3496, వి.శ్రీజ 3514, ఎం.డీ అబ్దుల్ ముజీబ్ 3675, శ్రీకిరణ్ 3752, పి.అరవింద్ కుమార్ 3875,ఎం.చంద్రశేఖర్ 4176, బి.సంధ్యవాణీ 4190, ఎం.నిత్య 4348,జి.షారోన్ 4358, ఆర్.అలేఖ్య 4519, కె.త్రిష 4529, డి.దిలీప్ కుమార్ 4558, ఆయేషా మహాజాబీన్ 4759, వై.అశలేష్ 4896, బి.దీపకళ 4957, ఆర్.కావ్య 4985 ర్యాంకులు సాధించారు. రాబోయేకాలంలో మరిన్ని మంచి ఫలితాలను సాధిస్తామని ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

'తూకంలో జాప్యంతోనే రైతు ఆత్మహత్యాయత్నం'



బాధిత రైతు నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): ధాన్యం తూకంలో జాప్యంతోనే రైతులు ఆత్మహత్యాయత్నం చేసుకునే పరిస్థితులు దాపురించాయని కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ఇటీవల మండలంలోని భూషణరావుపేటలో తూకం వేసిన వరిధాన్యం బస్తాలను తరలించడంలో జాప్యంతో రైతు గోపిడి మాధవరెడ్డి ఆత్మహత్యాయత్నం చేయగా, గురువారం ఆయనను పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల మనోవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని, యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్బందుల్లో ఉన్న రైతులను మానసికంగా కుంగదీసేలా బీఆర్ఎస్ నాయకులు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం దారుణమన్నారు. ఆవేదనలో ఉన్న రైతుపై బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా కేసులు పెట్టించడం సరికాదన్నారు. ధాన్యం బస్తాల్లో అదనంగా 2 కిలోలు తూకం వేసి రైతులను నట్టేటా ముంచడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎండీ అజీమ్, కూన శ్రీనివాస్, గడ్డం స్వామిరెడ్డి, వాకిటి రాజారెడ్డి, తొట్ల అంజయ్య, గడ్డం చిన్నారెడ్డి, ఎగ్యారపు శ్రీహరి, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, కట్ట శంకర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వేగంగా వచ్చి.. పాదచారులను ఢీకొట్టి..

- మొగిలిపేట శివారులో నడుచుకుంటూ వెళ్తున్నవారిని ఢీకొట్టిన బైక్
- చికిత్స పొందుతూ పాదచారి.. ఆస్పత్రికి తరలిస్తుండగా వాహనదారు మృతి



ఘటన స్థలంలో జబ్బార్



తీవ్రంగా గాయపడిన గఫార్



సురేశ్ (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని మొగిలిపేట శివారులో బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. భవన నిర్మాణ పనులు చేసే వలస కూలీలను ద్విచక్రవాహనదారు ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ద్విచక్రవాహనదారుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మొగిలిపేట గ్రామంలో భవన నిర్మాణ పనులు చేస్తున్న మేస్త్రి అశోక్ వద్దర జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు ఎండీ జబ్బార్(50), ఎండీ గఫార్ కొద్దిరోజులుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి ఇందిరమ్మకాలనీ నుంచి మొగిలిపేట గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన బరింద్ల సురేశ్(18) ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి జబ్బార్, గఫార్‌లను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయమైన జబ్బార్ మెట్‌పల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా, గఫార్‌కు చికిత్స అందిస్తున్నారు. ద్విచక్రవాహనదారు సురేశ్ తలకు తీవ్రగాయాలు కావడంతో జగిత్యాలకు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు ఎండీ జబ్బార్ కుమారుడు ఎండీ బెచ్చు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.